
ప్రజాశక్తి
గురువారం 8 ఆగస్టు 2024
5
పార్వతీపురం మన్యం



'మేము సైతం' ద్వారా రక్తసేకరణ

పార్వతీపురంరూరల్ : జిల్లాలో రక్తదానం సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో రక్త దానం కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మేము సైతం" శీర్షికన జిల్లాలో రక్త దానం శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఇది స్వచ్ఛంధంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 9న ప్రారంభిస్తామని, షెడ్యూల్ ప్రకారం అన్ని మండలాల్లో శిబిరాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతి శిబిరంలో కనీసం 50 యూనిట్లు సేకరించాలని లక్ష్యంగా ఉన్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక మాట్లాడుతూ ఐదు నెలల్లో జిల్లాలో అన్ని మండలాల్లో నిర్వహించుటకు చర్యలు చేపట్టామన్నారు. రక్త దాత ముందుగా నమోదు చేసుకొనుటకు ఒక పోర్టల్ తయారు చేస్తున్నామని తెలిపారు.

9న ఆదివాసీ దినోత్సవం

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఈనెల 9న ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వేదికగా ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు అద్దంపట్టేలా వేడుకలు ఉండాలని స్పష్టం చేశారు. ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కళాకృతులు, నృత్యాలు, వంటకాలు, పంటలు ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. వివిధ శాఖలు ప్రదర్శన శాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగు నీరు, పారిశుధ్యం నిర్వహణను సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమగు మందులు సిద్ధం చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఎస్.సేధుమాధవన్ మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఎపిఒ మురళీధర్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఆదివాసీ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. సంబంధిత అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈనెల 9న 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గిరిజన సంస్కృతికి సంబంధించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐటిడిఎ ఆవరణ, స్టేడియం వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, ఎంపిడిఒ గీతాంజలి, పాలకొండ మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావు, ఎపిడి శ్రీహరి ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 9న గుమ్మలక్ష్మీపురం వైటిసి లో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ ఉత్సవాల నిర్వహణపై బుధవారం కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తో గిరిజన జెఎసి నాయకులు సమీక్ష జరిపారు. ఉత్సవాలు ఏర్పాట్లకు ప్రణాళిక పై చర్చించారు. ఈ ఏడాది ఆదివాసీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ఆదివాసీ హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం

గిరిజన యూనివర్సిటీ నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వాలి
రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పేరుకే రిజర్వేషన్ ముందంజలో గిరిజనులని, ఆచరణలో పెత్తందారులు, భూస్వాములదే పెత్తనమని, ఆ విధానాన్ని అణగదొక్కి ఆదివాసీ గిరిజన హక్కులకై ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అంతరిక్షంలో మానవుడు నివసిస్తున్న నేటి తరుణంలో గిరిజన ప్రాంతంలో నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి కరువైందని, పారిశ్రామీకరణ విధానాలకు ఆమడ దూరంలో గిరిజనులు నివసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొండలపై నివసించే గిరిజనుల భూముల ఆక్రమణలకు పెట్టుబడుదారులు, భూస్వాములు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. గిరిజన హక్కులు, చట్టాలు రద్దుచేసి కొండలను ధ్వంసం చేసి వారి సంపదను కొల్లగొట్టాలని ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. ఈ విధానాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో గిరిజన సంపద కనుమరుగైపోతుందని వాపోయారు. ఈనాటికే గ్రామీణ ప్రాంతంలో ఆదివాసీలకు చదువును దూరం చేసే ప్రయత్నం చేపడుతున్నారని, అందులో భాగమే 117 జీవో అమలు, సిఆర్టిలను, టీచర్లను, ఎఎన్ఎంలను నియమించకపోవడమని తెలిపారు. బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి పాలకులకు గిరిజనుల పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేదన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

2014లో ప్రారంభానికి పూనుకున్న గిరిజన యూనివర్సిటీ నేటికీ దాని స్వస్థలం జాడలేదని మండిపడ్డారు. ఈ ఆదివాసీ దినోత్సవ సందర్భంగానైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన యూనివర్సిటీపై స్పష్టమైన హామీ ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలు పునఃప్రారంభించాలని, రోడ్లు, మంచినీరు, రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కుల అమలుకై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాలని, పోరాటమే సరైన మార్గంగా నిలిచిన అల్లూరి స్ఫూర్తితో విద్యార్థులు నిలవాలనిపిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు మాట్లాడుతూ విద్య అందని ద్రాక్షలా మారుతుందని, గిరిజన విద్యను సామాజికంగా అభివృద్ధి పరచాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి టి.అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, సురేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



కురుపాంలోని హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న పిఒ సేధుమాధవన్

ఏజెన్సీలో ఐటిడిఎ పిఒ పర్యటన

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

ఐటిడిఎ పిఒ ఎస్.సేధు మాధవన్ కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో బుధవారం పర్యటించి నిర్మాణ పనులు, ఆశ్రమ పాఠశాలలు, గర్భిణుల హాస్టళ్లను తనిఖీ చేశారు. కురుపాంలో నిర్మాణంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల పనులను పరిశీలించి, మిగిలిన పనులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. కురుపాంలో గల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి వంటగది, స్టాకురిజిస్టరు తనిఖీ చేశారు. వంటగది పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు నాణ్యతతో తయారుచేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో తుప్పలను వెంటనే తొలిగించాలని, శానిటేషను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం మండలం పెంగువ, గొరడ వద్ద హాట్ బజార్ నిర్మాణ పనులను, ఇఆర్ రోడ్డు నుంచి కనాసింగ్ వరకు రోడ్డు ఏర్పాటు పనులను పిఒ పరిశీలించారు. వైటిసి (గర్భిణీ స్త్రీల హాస్టల్)ని తనిఖీ చేశారు. గర్భిణులతో మాట్లాడి హాస్టళ్లలో కల్పిస్తున్న సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, గిరిశిఖర గ్రామాల్లో గల హైరిస్క్ కేసులను ముందుగానే గర్భిణీల హాస్టల్ కు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. గొరడలోని బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి వంటగది, సరుకుల నిల్వ గది, డార్మిటరీలు, పరిసరాలు, డైనింగ్ హాల్ క్షుణ్ణంగా పరిశీలించారు. సరుకుల రిజిస్టరు, ఇతర రిజిస్టర్లు తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. సరుకులను జాగ్రత్తగా నిల్వ చేయాలని ఆయన ఆదేశించారు. ఆహార పదార్థాల తయారీలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. శుభ్రమైన నీటిని వాడాలన్నారు. మెనూ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు.

గిరిజనులకిచ్చిన హామీలు అమలు చేయాలి

ఆదివాసీ ఉత్సవాల్లో స్పష్టత ఇవ్వాలి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

గిరిజనులకు ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలపై రానున్న ఆదివాసీ ఉత్సవాల్లో భాగంగా టిడిపి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇటీవల ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని చెప్పారు. జీవో3 షెడ్యూల్ గ్రామాలకు మాత్రమే వర్తిస్తుందని, దాన్ని అమలు చేసే ముందు ఇతర గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో ఆదివాసీ ఉత్సవాలను గిరిజన సంస్కతి సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆదివాసీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ ఉత్సవాల్లోనే టిడిపి ప్రభుత్వం జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, షెడ్యూల్ గ్రామాల జాబితాలో లేని గ్రామాలను చేర్చడం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకి, బెంతు మిరియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ చేసిన అసెంబ్లీ తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం హయాంలో ఈ తీర్మానం చేసినందుకు టిడిపి నాయకులు గగ్గోలు పెట్టి ఆందోళన చేశారని చెప్పారు. ఇప్పుడున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా రద్దు చేయాలని ధర్నా చేశారని గుర్తు చేశారు. గిరిజన యూనివర్శిటీని గిరిజన నియోజకవర్గంలోనే ఉండాలని కోరారు. మళ్లీ మైదానం ప్రాంతానికి తరలించాలని టిడిపి ఎమ్మెల్యే, ఎంపీ లు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇది జరిగితే గిరిజనుల కు తీరని నష్టమని అన్నారు. విలేకరుల సమావేశంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, పాచిపెంట మండల వైసిపి అధ్యక్షుడు జి.ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

పార్వతీపురంరూరల్: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేసి అందజేయాలని జిల్లా కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ జిల్లా అదికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 100 రోజుల కార్యాచరణను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో తయారుచేయాలన్నారు. గ్రామస్థాయిలో కమిటీ గ్రామ ప్రణాళికను తయారుచేసి అమలుచేయాలని తెలిపారు. ఇంటర్ విద్యార్థినిలకు వసతిగృహాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యకశ్రద్ధ వహించి టెన్త్, ఇంటర్ దూర విద్యా విధానం కోర్సుల్లో ప్రవేశాలకు నమోదు చేయించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో "పేదల సేవలో" ప్రత్యేక కార్యక్రమం ప్రభుత్వం రూపొందిస్తున్నదని, దీనికి సంబంధించిన విదివిధానాలు త్వరలో వస్తాయని, ప్రతి అధికారి నెలలో ఒకరోజు గ్రామంలోనికి వెళ్లి ప్రజలకు కావలసిన సేవలు అందించాలని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆధార్ అనుసంధానం ఇబ్బందులను అప్డేట్ చేయించాలని తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నాగావళి నడకలు, నీ స్ఫూర్తితో పుస్తకాలావిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రముఖ కవి, కథారచయిత, గేయరచయిత, గాయకులు గంటేడ గౌరునాయుడు 71వ పుట్టినరోజు సందర్భంగా ఆయన రచించిన "నాగావళి నడకలు", ఆయన మిత్రులు రాసిన "నీస్ఫూర్తితో" పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంను స్నేహ కళా సాహితీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్జీవో భవనంలో నిర్వహించారు. ఒకసప్తతి సంతోషహేళ- మరికొన్ని ఆవిష్కరణల వేళ జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తల సమక్షంలో గంటేడ గౌరు నాయుడు- జానకమ్మ దంపతులుతోపాటు సాహితీలహరి అధ్యక్షులు డాక్టర్ మంచిపల్లి శ్రీరామ్మూర్తి, ప్రముఖవైద్యులు వెంకటరావు, సాహితీవేత్త చదలవాడ సత్యనారాయణ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీ ప్రముఖులు మాట్లాడుతూ నాగావళి నదిఒడ్డున ఉన్న జీవితాలను అక్షరబద్ధం చేస్తూ గంటేడ గౌరునాయుడు జ్ఞాపకాలని, అనుభవాలని రికార్డుచేసిన చారిత్రక చిత్రమే నాగావళి నడకలు పుస్తకమని తెలిపారు. గంటేడ స్ఫూర్తితో కవులుగా, రచయితలుగా ఎదిగిన వివిధ సాహిత్యకారులు తమ స్పందనను తెలిపిన పుస్తకం నీ స్ఫూర్తితో అని తెలిపారు. ఉత్తరాంధ్ర జన జీవితాన్ని, ప్రజల ఆకాంక్షలను తన రచనలద్వారా ప్రపంచానికి తెలియజేసిన సాహితీవేత్త గౌరు నాయుడని కొనియాడారు. ఎన్నో పుస్తకాలను రచించడంతో పాటు ఎన్నో అవార్డులను సత్కారాలను ప్రశంసలను పొందిన మహెూన్నత వ్యక్తి గౌరునాయుడని వారంతా కొనియాడారు. 70వసంతం పూర్తిచేసుకొని 71వ వసంతంలోకి అడుగుపెట్టిన గౌ.నాను సాహితీవేత్తలు, కుటుంబ సభ్యులు,శ్రేయోభిలాషులు, మిత్రులు,బంధువులు, స్నేహితులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్నేహ కళా సాహితీ అధ్యక్షులు జి రామకృష్ణ, రచయితలు జాగాన సింహాచలం, పాలకొల్లు రామలింగస్వామి, మళ్లీపురపు జగదీశ్, చింత అప్పలనాయుడు, పక్కి రవీంద్ర, తేజోమూర్తుల ప్రకాశరావు, ఎం వి ఆర్ శర్మ, సిరికి స్వామినాయుడు, పల్లరోహిణి, పిల్లా లక్ష్మ నాయుడు, గొండేల రాజారావు, గోపాల రావు, నాగు కాకిముక్కల, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న డిఒఒ పగడాలమ్మ

విద్యా ప్రమాణాలు పెంచాలి : డిఇఒ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల సిబ్బందితో సమావేశమై పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరగడానికి తగు ప్రణాళిక రూపొందించుకోవాలని, ఆరో తరగతి నుండే పిల్లలకు తెలుగు, ఆంగ్లం, గణితంలో తగు శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రతి పాఠశాలలోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని దీంతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. అలాగే బడి తోట పెంచి తద్వారా వచ్చిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించాలన్నారు. జ్వరంతో బాధపడి తిరిగి పాఠశాలకు వచ్చిన పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని, వారికి వేడి నీరు, ఆహారాన్ని అందించాలని సూచించారు. చదువుతో పాటు ఆటల్లోనూ పిల్లలు రాణించేలా చూడాలని కోరారు . ప్రతి ఉపాధ్యాయుడు వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, డైరీ విధిగా కలిగి ఉండి తగిన బోధనోపకరణాలు తయారు చేసుకుని వాటితో పిల్లలకు బోధించాలన్నారు. ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టేలా చూడాలని కోరారు. పాఠశాల ప్రాంగణాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని, ప్రయోగశాలలను ఆట స్థలాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల యొక్క లెసన్ ప్లాన్స్ ను డైరీలను తనిఖీ చేశారు.

బిసి కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో బిసి కాలనీలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ జ్వర పీడితులకు వివిధ రకాలైన రోగులకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు ప్రత్యేక గుర్తింపు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకొండ

దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్దది చేనేతరంగమని, అటువంటి రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని ఆర్‌డిఒ వివి రమణ అభిప్రాయపడ్డారు. చేనేత, జౌళి శాఖ పాలకొండ వీవర్స్ ఆధ్వర్యంలో పదో జాతీయ చేనేత దినోత్సవం బుధవారం స్థానిక శ్రీ కోటదుర్గా వీవర్స్ సొసైటీలో ఘనంగా నిర్వహించారు. తొలుత పాలకొండ శ్రీ కోట దుర్గా వీవర్స్ సొసైటీ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వీవర్స్ కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీకోట దుర్గా వీవర్స్ సొసైటీ ఆవరణలో చేనేత ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఆర్‌డిఒ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసిందని, వీటి ద్వారా చేనేత కళాకారులకు మేలు జరిగిందని చెప్పారు. మార్కెట్లో డిమాండ్ ఉంటే భావితరాలు చేనేత వస్త్రాలు వాడేందుకు ముందుకు వస్తారన్నారు. అందరం చేనేత వస్త్రాలు వినియోగించి చేనేతను ప్రోత్సహించాలన్నారు. మానవ మనుగడలో చేనేత ఉత్పత్తుల ప్రభావం ఉంటుందన్నారు. చేనేత ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం తరపున ముద్ర లోన్ అందజేస్తుందని, ఇందులో భాగంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి, 12 మందికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ చేనేత ఉత్పత్తులపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఇద్దరు చేనేత కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ పథకం ద్వారా 12 మంది నేతవారికి మగ్గం ఉపకరణాలు, ఒక మగ్గం అందజేశారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ అభివద్ధి అధికారి నల్ల వెంకటరమణ, చేనేత రంగ ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



వీవర్స్ సొసైటీలో నేతలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రమణ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం ఇన్చార్జి ప్రిన్సిపల్ వి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెకెసి కోఆర్డినేటర్ ఎం రవికిరణ్ కుమార్ మాట్లాడుతూ చేనేత రంగం భారతదేశ సంస్కృతిక వారసత్వ స్నేహం అని అన్నారు. ఈ వారసత్వాన్ని కాపాడడానికి ఈ రంగంలోని కార్మికులను శక్తివంతంగా చేనేత వస్త్రాలను ఉపయోగించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో బోధకులు శంకర్రావు తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : చేనేత వస్త్రాలను ధరించి కార్మికులను ఆదుకోవాలని, సాంప్రదాయ దుస్తులను ధరించి భారతీయతను కాపాడాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ కల్పనా కుమారి అన్నారు. చరిత్ర అధ్యాపకులు శ్రీవాణి ఆధ్వర్యంలో నేషనల్ హ్యాండ్లూమ్స్ డే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నేడు చేనేత కార్మికుల జీవనం దుర్భరమైందని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందన్నారు. వారు నేసే వస్త్రాలు ధరించి ఆదుకొని ప్రోత్సహించాలని అన్నారు. యువత రెడీమేడ్ వస్త్రాలపై ఆకర్షితులు కావడం వల్ల చేనేత కార్మికులు దిగజారిపోతున్నారని వాపోయారు. విద్యార్థులు చేనేత వస్త్రాలను ధరించి ఫ్యాషన్ షో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, అధ్యాపకులు ఉన్నారు.

ఆర్‌టిసి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ కన్వీనర్ బివి రమణ, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆర్టీసీ డిపో పరిధిలోని కాంటాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో మెకానిక్‌లు, సహాయకులుగా 19 మంది గత పదేళ్లుగా పనిచేస్తున్నారని, ప్రతి రెండేళ్లకు వీరి జీతాలు సవరిస్తూ ప్రభుత్వం టెండర్ మంజూరు చేస్తుందని తెలిపారు. టెండర్‌లో కాంట్రాక్టర్లకు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జీతాలు చెల్లించడంలేదని కార్మికులకు ఇస్తున్న జీతాల్లో కోతలు విధిస్తున్నారని అన్నారు. దీనివల్ల కష్టపడి పనిచేసే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని అన్‌స్కిల్డ్, సెమిస్కిల్డ్‌గా పనిచేస్తున్న వాళ్ళందర్నీ స్కిల్ వర్కర్స్‌గా పరిగణించి జీతాలు సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన జీతాలను ఏప్రిల్ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ సమస్యలను ఆర్టీసీ డిపో మేనేజర్, కాంట్రాక్టు ప్రతినిధులకు తెలియజేశామని, రెండు రోజుల్లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిభాస్కరరావు, ఎం.త్రినాధ, బి.కృష్ణకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికులు

తల్లిపాలు పిల్లలకు సంజీవని

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తల్లి పాలు సంజీవని వంటివని, పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంటలోపుల తల్లి పాలు తాగించాలని, ఆపాలల్లో బిడ్డకు కావాల్సిన పోషకాలుంటాయని, ఆ పాలు తాగిన పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందని అన్నారు. కావున తల్లులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బిడ్డపుట్టిన ఆరు నెలల వరకు మెదడు పెరుగుదల ఉంటుందని, ఆ సమయంలో తల్లిపాలు చాలా అవసరమన్నారు. ఆరోగ్యవంతమైన పౌరులుగా ఎదగడానికి తల్లిపాలు చాలా అవసరమని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి బిడ్డకు తల్లేనని, వారు పిల్లలకు కావాల్సిన పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, తల్లులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రచారంతో పాటు, బాల్యవివాహాలు చేయడం వల్ల నష్టాలు, 100 రోజుల ప్రణాళిక, మానవ అక్రమరవాణా, మహిళలపై అఘాయిత్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.శోభారాణి, మహిళా శిశు సాధికారిత అధికారిని ఎం ఎం రాణి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి బి. శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసరు వై.విజయమోహన్, ఎంఇఒ కె.ప్రసాదరావు, హెడ్ కానిస్టేబుల్ లావణ్య, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పౌష్టికాహారం తీసుకున్న గర్భిణీలు రక్తహీనత లేకుండా ఉంటారని, శిశు మరణాలు లేకుండా సుఖప్రసవాలకు వీలుంటుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక వైటిసిలో గర్భిణులకు నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల వసతిగృహాల ఏర్పాటుతో శిశు మరణాలు పూర్తిగా నివారించడం జరిగిందన్నారు. మరోవైపు గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందడంతో సుఖ ప్రసవాలకు వీలు కలుగుతుందన్నారు. వైటిసి మేనేజర్ రాము మాట్లాడుతూ ఇప్పటి వరకు 200 మంది గర్భిణులకు సుఖ ప్రసవాలు జరిగాయన్నారు. అనంతరం భద్రగిరి ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పౌష్టికాహారం వారోత్సవాల ప్రాముఖ్యత ప్రతి గర్భిణీ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తల్లిపాలు, బిడ్డకు పుట్టిన బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని, ఆరు నెలల వరకు చిన్నారులకు ముర్రిపాలు ఇవ్వాలని అప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణీలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు వెంపటాపు భారతి,రొబ్బ లోవ రాజు తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి: మండలంలో తల్లిపాలు వారోత్సవాలు ముగింపు సందర్భంగా కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల పరిషత్ వైస్‌చైర్మన్ మరిచర్ల బాపూజీ నాయుడు తల్లిపాలు పిల్లలకు అమృతమన్నారు. అలాగే తల్లిపాలు పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ జి.సుగుణకుమారి, గరుగుబిల్లి సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎంపిటిసి ప్రతినిధి దేవాతి జోజి, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, పి.అరుణకుమారి, ఎల్.శారదాంబ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : తల్లి పాలు బిడ్డలకు శ్రేయస్కరమని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు చెప్పారు. స్థానిక వైటిసిలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన తల్లి పాలు వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లి పాలను మించిన పోషకాహారం లేదని చెప్పారు. ఐసిడిఎస్ సిడిపిఒ సత్యవతి మాట్లాడుతూ తల్లి పాలు తాగి పెరిగిన బిడ్డలకు ఆరోగ్యంతో పాటు తెలివితేటలు కూడా వుంటాయని చెప్పారు. తల్లిపాలలో వున్న పోషకవిలువలు ఎందులోనూ వుండవని చెప్పారు. కార్యక్రమంలో వైటిసి మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

భామిని : పుట్టిన బిడ్డ నిరోధకతకు, శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లి పాలు కీలకమని ఐసిడిఎస్ పిఒ శాంతి భవాని తెలిపారు. బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతి లక్ష్మి, సబితా పట్నాయక్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర


ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న వేతనదారులు

ఉపాధి బిల్లులు చెల్లించండి : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

ఉపాధిహామీ పనులు చేసి రెండునెలలైనా వేతన బిల్లులు చెల్లించకపోవడం దారుణమని సిపిఎం నాయకులు వై.మన్మధరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపి, ఎంపిడిఒకు వినతిని అందజేశారు. అనంతరం మన్మధరావు మాట్లాడుతూ ఇప్పటికే మూడు నుంచి ఆరు వారాల బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. మండుటెండలో వడదెబ్బకు గురై రెండు పూటలా పనులు చేశారని, అయినా బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని ఉపాధి కూలీలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొద్దాన భానుమూర్తి, పి.వెంకటస్వామి, గంట్యాడ బలరామనాయుడు, నల్ల ఈశ్వరరావు, ఆవు సాంబమూర్తి, దన్నాన త్రినాధ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ అభ్యర్థులకు డిఎస్‌సిలో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఓపెన్ ఇంటర్ చదివిన విద్యార్థులకు బిఇడి, టెట్, డిఎస్‌సి పరీక్షలకు అనర్హులని తీర్పు చెప్పడం బాధాకరమని దీన్ని ఖండిస్తున్నట్టు సవర భాష వాలంటీర్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొంగి శ్రీను, సవర డొంబు, నాయకులు ఆనందరావు, మాసయ్య, భారతి ఒక ప్రకటన తెలిపారు. 2012సంవత్సరంలో పేద, బలహీన వర్గాల పిల్లలు కోసం ఓపెన్ స్కూల్ విద్యా వ్యవస్థ ప్రవేశ పెట్టి చాలా మంది విద్యార్థులు పది, ఇంటర్ చదువు కోడానికి అవకాశమిచ్చిందన్నారు. ఈ ప్రభుత్వాల ద్వారా అనేక మంది డిఇడి, జెఎన్‌ఎమ్, పిఇఒ తదితర వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందారన్నారు. ఈ శిక్షణ నిమిత్తం వేల రూపాయలు అప్పులు చేసి ఫీజులు కట్టారన్నారు. కానీ కోర్టు ఓపెన్ ఇంటర్ చదివి డిఎడ్‌లో శిక్షణ పొందిన టెట్, డిఎస్‌సిలో అనర్హులుగా తీర్పు ఇవ్వడం బాధాకరమని, దీన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, విద్యా శాఖ మంత్రి స్పందించి పరిష్కారం చూపాలని కోరారు.

బుద్దిపేటలో పొలంబడి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బుద్దిపేటలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మేలైన వ్యవసాయ పద్ధతులలో భాగంగా ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో వరి పొలం గట్లు మీద బిరెన్ గార్డెన్ విత్తనాలు ఉచితంగా రైతులకు అందజేశారు. అలాగే కలుపుతీతలో భాగంగా చేతితో కలుపు తీయడం, యంత్ర పరికరాలు ద్వారా తొలగించడం, రసాయన ద్వారా నియంత్రణపై వివరించారు. చేతితో కలుపు తీసే పద్ధతి వల్ల చాలా ఉపయోగాలున్నాయని తెలిపారు. వరిలో మొదటి వారం రోజులు ప్రిటిలాక్లోర్, సై హలో పాప్ బ్యూటిల్, బుటాక్లోర్ 15-20 రోజులు తర్వాత 24, డినోఈయం సాల్ట్ (బిస్పైరిపాక్ సోడియం), పెండిమితలిన్ తదితర రసాయనాలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సవరపు అవినాష్, విఎఎ పి.లక్ష్మణ్, బి.సుధీర్, ఎపిసిఎన్ఎఫ్ గంగరాజు, నవీన్, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణ శివారులో గల జట్టు ఆశ్రమంలో ఎమ్మెల్యే విజయ్‌చంద్ర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు విస్తారంగా పెంచాలని అన్నారు. పచ్చని పార్వతీపురం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జట్టు నిర్వాహకులు పద్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొబ్బరి సాగుపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

కొబ్బరి మొక్కలు పెంచే రైతులకు దాని సస్యరక్షణ చర్యలు, సాగు పై అవగాహన ఉండాలని నాబార్డ్ ఏజిఎం ఎస్.దినేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో రస్తకుంటుబాయి కెవికెలో రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ కార్యక్రమానికి హాజరై 5540 మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కొబ్బరి పెంచే విధానం దాని సస్యరక్షణ, సాగు యాజమాన్యంపై కెవికె శాస్త్రవేత్త లు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, కెవికె శాస్త్రవేత్తలు ఎస్. శ్రీనివాస్ రాజు, అమ్మవలస రైతులు పాల్గొన్నారు.

నేడు 85 పాఠశాలల్లో ఎన్నికలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని 85 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహిస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఇఒ పి.సత్యనారాయణ తెలిపారు. ములక్యాయ వలస మోడల్ పాఠశాల, ఎ.వెంకంపేట, వెంకట భైరిపురం, మక్కువ, శంబర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అవసరమున్న చోట పోలీసు బందోబస్తు కూడా కోరామన్నారు. నిబంధనల మేరకు పిల్లల తల్లిదండ్రులు కనీస బాధ్యతగా ఈ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

గుమ్మలక్ష్మీపురం : ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల కన్న కలలు నెరవేర్చే విధిగా రంగాల్లో రాణించిన నాడే గ్రామానికి, ప్రాంతానికి మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం కళాశాల పరిసరాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు ఉన్నారు.

సౌకర్యాలు మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని సర్పంచ్ బొద్దాడ గౌరీ శంకర్రావు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో గల గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. పాఠశాలలో విద్యా బోధన, భోజన సౌకర్యం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రవంతి, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 8నుంచి 10వరకు మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ ఎఎలిని సుభద్రమ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల శిక్షణ ఉంటుందని, ప్రతి ఒక్కరూ శిక్షణలో పాల్గొనాలని ఆయన కోరారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడు జంక్షన్ వద్ద గల బుధవారం ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఢీకొనడంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వీరఘట్టం నుండి పాలకొండ వైపు ఆటో ప్రయాణికులు ఎక్కించుకుని వెళ్తుంది. పాలకొండ నుండి వీరఘట్టం వైపు వస్తున్న వాహనం రేగులపాడు జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి అందులో ప్రయాణికులు చెల్లాచెదురయ్యారు. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు.స్వాతంత్రం వచ్చి 75ఏళ్లు పూర్తయినా గిరిజన బతుకుల్లో మార్పు రాలేదని, రోడ్లు, విద్య, వైద్యానికి దూరమవుతున్నారని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన డబ్బులు గిరిజనుల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టకుండా గిరిజనులను వెనక్కి నెట్టేస్తున్నారని అన్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని కోడుమూరు - మెట్టవలస వద్ద ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మంచాల శ్రీనివాసరావు అధ్యక్షతన సభ జరిగింది. తొలుత గిరిజన సంఘం సీనియర్ నాయకులు అప్పలస్వామి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి పది ఎకరాలు చొప్పున పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో 3ను కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు గిరిజనులు సాగు చేస్తున్న భూములకు హక్కులు లేకుండా చేస్తూ గిరిజనులకు ఎటువంటి భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. అనుసరి భూములు సర్వేలు చేసి సాగు హక్కులు ఇవ్వాలని లేదంటే ఈ భూములన్ని అన్యాక్రాంతమవుతున్నాయని అన్నారు. గిరిజన సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన యూనివర్సిటీ పెట్టి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని గిరిజనులు సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని కుడుమూరు భూ సమస్య 48 సర్వేనెంబర్ 782 ఎకరాలు తాతల కాలం నుంచి సాగు చేస్తున్న గిరిజనులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తాగునీటి సమస్య రహదారులు వైద్యం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని వేటగానివలసలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలన్నారు. 1/70 చట్టం పిఎస్ఆర్ చట్టం అమలు కోసం జీవో 3 త్రీను కొనసాగించాలని, గిరిజన హక్కుల కోసం ఆరోజు పోరాడి సాధించుకున్న హక్కులు కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా కంకణం కట్టుకొని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం సీనియర్ నాయకులు సూకూరు అప్పలస్వామి, మండల నాయకులు కొర్ర కల్యాణ్ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, పాల్గొన్నారు.


పాచిపెంట : సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

రావికోనలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

పార్వతీపురంరూరల్ : మండలంలోని రావికోన గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా రావికోన సర్పంచ్ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అటవీ హక్కు చట్టాన్ని సవరణ చేసి అడవికి దూరం చేస్తున్నారని, అందులో భాగమే కొండపోడు వ్యవసాయం చేస్తుంటే ఫారెస్ట్ అధికారులను పంపించి పోడు వ్యవసాయం చేస్తే మీపై కేసులు పెడతామని బెదిరింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. మండలంలో అన్ని గ్రామాల్లో భూ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, కొండపోడు పట్టాలు ఇస్తున్నారని, గిరిజన భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండాలంటే పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.రాము, వరాలు మెళ్ళక లక్ష్మణరావు, వార్డ్ మెంబర్లు పి.సంతోష్, కె.ప్రసాదు, పి.లక్ష్మణరావు, కె.పోలిరాజు, కె.చింతామణి, గ్రామ కమిటీల సభ్యులు, యుత్ పెద్ద ఎత్తున తదితరులు ప్రజలు పాల్గొన్నారు.

పశుగణనపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

21వ అఖిల భారత పశుగణన పై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు ఐదేళ్లకొకసారి పశుగణన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారంతో ముగిసిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గల 2,89,677 కుటుంబాలను పశుసంవర్ధక శాఖ నుండి ఎంపిక చేసిన 294 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్వైజర్లను ప్రతి ఇంటికి సందర్శించి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వివరాలు నమోదు చేస్తారన్నారు. నమోదు ప్రక్రియ అంతా మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తామన్నారు. ఎన్యూమరేటర్ల పనితీరును పర్యవేక్షించడానికి 25 మంది పశువైద్యలను సూపర్వైజర్లుగా నియమించామన్నారు. ఈనెల 6 నుంచి 9 వరకు ప్రతిరోజు శిక్షణ నిర్వహించనున్నామని తెలిపారు. సెప్టెంబర్ నుంచి 21 వరకు పశుగణ చేపట్టిందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేశారని వివరించారు. కావున పశువైద్యాధికారులు సిబ్బంది అందరూ వారి వారి పరిధిలోని ఇళ్లను సందర్శించి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్లు, పాలిచ్చే పశువులు, కుక్కలు పెంపుడు కుక్కలు దాదాపు 15 అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. తద్వారా పాలు, గుడ్లు, మాంసం ఇతరత్రా దిగుబడి ఎంత ఉందనేది ఈ గణాంకాల ద్వారా తెలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆర్.నీలయ్య, సహాయ సంచాలకులు, కె. ప్రసాద్ , పశు వైద్యాధికారులు రమేష్, చక్రధర్, పలువురు సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

పెరిగిన సీట్లకు 13న కౌన్సిలింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి ఎపి గిరిజన గురుకుల బాలికల కళాశాలలో (పిటిజి) సీట్ల సంఖ్య పెరిగినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎ.సత్యవతి తెలిపారు. ఒక్కొక్క గ్రూపునకు పది చొప్పున సీట్లు పెరిగాయన్నారు. ఈ పెరిగిన షీట్లకు ఈనెల 13న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, ఆసక్తి గల గిరిజన బాలికలు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటల్లోపు కళాశాలకు రావాలన్నారు. ఎంపిపి 10, బైపిసి 10, హెచ్ఇసి 10 చొప్పున సీట్ల సంఖ్య పెంచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

విఒఎల తొలగింపు నా వరకూ రాలేదు : పీడీ

జియ్యమ్మవలస : మండలంలోని పనిచేస్తున్న 8మంది విఒఎల తొలగింపు తనవరకు రాలేదని డిఆర్‌డి పీడీ వై.సత్యంనాయుడు తెలిపారు. మండలంలోని విఒఎలను టిడిపి నాయకులు అక్రమంగా తొలగించారన్న వచ్చిన వార్తలో వాస్తవం లేదని, వారిని అధికారికంగా తొలగించినట్లు ఎలాంటి ప్రకటన జరగడంలేదని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తికి ఆయన తెలిపారు. వాస్తవానికి 8మందిని తొలగించే ప్రతిపాదన చేసినప్పటికీ దాన్ని తాము అంగీకరించడం లేదని ఆయన వివరించారు. విఒఎలు ఎప్పటిలాగే తమ విధులను నిర్వహించాలని, అనవసరమైన సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలు చిరు ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయొద్దని పిడి చెప్పినట్లు తెలుస్తోంది. విఒఎలు ప్రస్తుతం చేయాల్సిన అనేక పనులు పెండింగ్లో ఉన్నాయని, వారు మొబైల్ బుక్ కీపింగ్, జీవనోపాధుల సర్వే, రుణాల రికవరీ, కొత్త రుణాలు మంజూరు , లక్ ప్రతీ ధీధి , సంఘాలు బలోపేతం ఇలాంటి ఎన్నో అంశాలపై పనిచేయాల్సి ఉందన్నారు. కావున విఒఎలు ఎప్పటిలాగే తమ విధులు నిర్వహించి సిసిలకు, ఎసిఎంలకు సహకరించాలని ఆయన తెలిపారు.


సామూహిక స్నానాల ఖానా, బోర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

వైటిసి లో రూ.3లక్షలతో మంచినీటి సౌకర్యాలు కల్పన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక యువత శిక్షణ కేంద్రం(వైటిసి)లో కొత్తగా నిర్మించిన సామూహిక స్నానాల ఖానా, రెండు పంపు బోర్లను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం వైటిసిలో గిరిజన యువతకు నైపుణ్యాలకు అనుగుణంగా స్థానిక అవసరాలను బట్టి ఉపాధి, స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు త్వరలో నిర్వహించబోతుందన్నారు. మరోవైపు నిరుపేద గిరిజన అభ్యర్థుల అభ్యర్థన మేరకు టెట్, డిఎస్‌సి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ త్వరలో ప్రారంభించినట్లు ఆమె చెప్పారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ కూడా విడుదలైందన్నారు. జనసేన నాయకులు, అక్షయ ఫౌండేషన్ చైర్మన్ యోగి రెడ్డి తిరుపతినాయుడు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సూచనల మేరకు గర్భిణీ వసతి గృహానికి గతంలో మెడికల్ కిట్లు అందజేశామన్నారు. ప్రస్తుతం విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్ వితరణగా అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జనసేన సమన్వయకర్త మల్లేశ్వరరావు, డుమ్మంగి సర్పంచి పాలక క్రాంతి కుమార్, నాయకులు వెంపటాపు భారతి, వైటిసి మేనేజర్ అన్ను రాము, డిఇ సింహాచలం, ఎఇ అప్పారావు, ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధపెడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని బైపాస్ రోడ్డు కాలనీ వద్ద ఉన్న వరహాల గెడ్డ నుంచి పాత బస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపాలిటీలో కాలువల్లో పూడికలు తీతలకు, నిర్వహణకు ప్రత్యేక నిధులను కేటాయించామన్నారు. ఈ నేపథ్యంలో కాలువల్లో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టామని, పూడికలను తొలగించి, చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే చక్కని ఆరోగ్యం ప్రజల సొంతమని, దీనికి ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతి కాలువలను పూడిక తీసి రోగాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, డిఇ పి.కిరణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ మురళి, అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వసతిగృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ సంతోష కుమారి గురుకుల పాఠశాల సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాల, పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు అందజేశారు. అలాగే విద్యార్థులు ఎవరూ జ్వరాల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని, ఎవరికైనా ఇబ్బంది కలిగితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వాతావరణ మార్పుల వల్ల జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతో ఉండాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థుల సిక్ రిజిష్టర్లు, ఆరోగ్య తనిఖీ వివరాల రికార్డులు పరిశీలించి ఏ విధమైన ఆరోగ్య సమస్యలు నమోదవుతున్నాయి, వారికి అందిస్తున్న వైద్యం వివరాలు తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది హాస్టళ్లను తరచుగా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేయాలని ఆదేశించారు. సిక్ రూమ్‌లో ఉన్న మందులు, కిటికీలకు దోమల మెస్సుల అమరిక తీరును పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత తీరును గమనించారు. వాడుక నీరు పరిసరాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, హాస్టల్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంధ్యారాణి, సూపర్వైజర్లు చిన్నమ్మి , రమణమ్మ, ప్రసాద్, వైద్య సిబ్బంది రామకృష్ణ, పకీరునాయుడు, పార్వతీ, వెంకటలక్ష్మి, స్వాతి, ఆశాకార్యకర్త పాల్గొన్నారు .

కొత్తూరులో రెండు వసతి గృహాలు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం కొత్తూరులో వేర్వేరుగా బాలికలకు రెండు వసతి గృహాలు ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరులో వివిధ కళాశాలల్లో చదువుతున్న గిరిజన బాలురు, బాలికలు ఈ వసతి గృహాల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9 4 90 94212696 528585 61 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి


ప్రజాశక్తి - సీతంపేట

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు ఒక ప్రకటన తెలిపారు. ఆదివాసీ కట్టు, బొట్టు, భాష, ఆచార, సంస్కృతికకు ప్రత్యేక దినోత్సవం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, రాజకీయాలకు అతీతంగా ప్రజలు, ఆదివాసీ సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాలు ప్రతి ఒక్కరూ విచ్చేసి ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

జ్వర పీడితులందరికీ రక్త పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రతి జ్వరాన్ని మలేరియాగానే అనుమానించి తక్షణమే రక్త పరీక్షలను జరపాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ సూచించారు. బుధవారం ఆయన జిల్లా ఆసుపత్రిలోని ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఐపి, ఒపిల్లో నమోదైన జ్వరాల వివరాలను చూసి ప్రతి పాజిటివ్ కేసు ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు కావాలని, ఆర్‌టి చికిత్స వెంటనే ఆరంభించాలని సూచించారు. జ్వరాలు రాగానే పరీక్షలు చేసుకుంటే వ్యాధి తీవ్రత తగ్గుతుందని, సకాలంలో నయం చేయవచ్చునని చెప్పారు. ఆర్‌డిటి పరీక్ష కంటే రక్త పూతలు మెరుగైన ఫలితాలు ఇస్తాయన్నారు. ఆ దిశగా ఆలోచించాలని ల్యాబ్ టెక్నిషియన్లు శ్రీనివాస్ మరియు పద్మ్వలకు సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

పిఆర్‌బి-1యాప్‌లో అప్‌లోడింగ్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పంచాయతీ రాజ్-1 (పిఆర్-1)లో డ్రెయిన్లు, నీటి నిల్వ ప్రదేశాలు, వాటర్ ట్యాంకులు, క్లోరినేషన్ రిజిస్ట్రేషన్లు, తదితర అంశాలను తక్షణమే అప్లోడ్ చేయాలని ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి కెకె వర్మ తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతోనూ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఒడిఎఫ్ ప్లస్ సర్వే వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. దీనిపై సచివాలయ సిబ్బంది మొత్తం పనిచేసి సకాలంలో పూర్తి చేయాలని కోరారు. దీంతో పాటు ఆరుబయట మలవిసర్జన లేకుండా అవగాహన నిర్వహించాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు వాడకం పెరగడంపై కూడా అవగాహన సారించాలని అన్నారు. పారిశుధ్య పనులు చేయడంతో పాటు గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో తప్పనిసరిగా ఇళ్ల పన్నుల వివరాలను ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణ సక్రమంగా జరగాలని, రాత్రిపూట విషజంతువులు బారిన పడకుండా వీధి దీపాలు వెలిగేలా సిబ్బంది దృష్టి సారించాలని అన్నారు. గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం తెలియజేసిన అన్ని కార్యక్రమాలు విధిగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వారితో పాటు మండల ఇంజనీరింగ్ అధికారి చంద్రమౌళి, 35 గ్రామ పంచాయతీల కార్యదర్శి 21 గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

బాల్య వివాహాలు చేయడం వల్ల చట్టరీత్యా నేరమని ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలలో బుధవారం కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చదువులే ముఖ్యమని, బాల్య వివాహాలు జరిపి వారి భవిష్యత్‌ను పాడుచేయ వద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు. కొమరాడ సిడిపిఒ జి.సుగుణకుమారి మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాలికలకు, ఆపద సమయంలో అవసరమైన సహాయం కోసం చైల్డ్ కేర్ హెల్ప్ లైన్‌ను ఎలా సంప్రదించాలో సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎంపిటిసి ప్రతినిధి దేవాతి జోజి, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, పి.అరుణకుమారి, ఎల్.శారదాంబ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - భామిని

వసతి గృహంలో ప్రతి విద్యార్థి వ్యక్తి గత శుభ్రత పాటించాలని మలేరియా అధికారి అప్పారావు తెలిపారు. భామినిలో గిరిజన ఆశ్రమ పాఠశాలను మలేరియా అధికారి ఆధ్వర్యంలో భామిని పిహెచ్‌సి వైద్య సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులు, డార్మిటరీ, వంటగదిని పరిశీలించారు. వసతిగృహంలో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియాపై అవగాహన కలిగించి, ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని, వేడి నీరు తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు. హెచ్‌వి గౌరీశ్వరి, ఎఎన్ఎం సునీత, ఆశా కార్యకర్త సునీత ఉన్నారు.